# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- వచ్చే నెల 3, 4వ తేదీల్లో చిత్తూరు, తిరుపతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్నారని వైసీపీ నేత పెద్దిరెడ్డి చంద్రారెడ్డి తెలిపారు.
- అన్ని వర్గాలకు న్యాయం చేసేలా అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక చేపట్టామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ఈవీఎంల భద్రతా ప్రమాణాల్లో ఎటువంటి లోపం ఉండరాదని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు.
- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక హెచ్చరించారు.

====================

చిత్తూరు, తిరుపతిలో ఏప్రిల్ 3, 4వ తేదీల్లో జరగనున్న "సిద్ధం" సభల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొంటారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తిరుపతిలోని వైసీపీ కార్యాలయంలో "సిద్ధం" సభ కరపత్రాలను ఈరోజు ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో మొత్తం 21 "సిద్ధం" సభలను నిర్వహిస్తామన్నారు. ఈనెల 27 ప్రొద్దుటూరు, 28 నంద్యాల, 29 ఎమ్మిగనూరులో సమావేశాలను నిర్వహిస్తామని.. ఇప్పటికే రాష్ట్రంలో 4 చోట్ల ఈ సభలు నిర్వహించామన్నారు. ఆ నాలుగు ప్రాంతాలు మినహాయించి మిగిలిన 21 జిల్లాలో సభలు జరుగుతాయన్నారు.

====================

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆన్ లైన్ వేధింపులు, సోషల్ మీడియాలో అసత్య వార్తలు ప్రచారాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి. ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్ బుక్, ఎక్స్, యూట్యూబ్ వంటి సోషల్

మీడియాలో తప్పుదారి పట్టించే సమాచారాన్ని గాని, మార్ఫింగ్ చేసిన ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేయడం, ఫార్వర్డ్ చేయడం గాని చేయకూడదని సూచించారు. అటువంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిబంధనలను, నియమావళిని ఉల్లంఘించినట్లు అయితే హెల్ప్ లైన్ నెంబర్ 1950కి, ల్యాండ్ లైన్ నెంబర్ 08942-240606కి గాని, www.cybercrime.gov.in వెబ్ సైట్ లో గాని ఫిర్యాదు చేయాలని తెలిపారు.

=====================

ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక ఎంతో కీలకమని, సమర్థులైన వ్యక్తులకే ప్రజల ఆమోదం ఉంటుందని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శాసనసభ, పార్లమెంటు అభ్యర్థులకు ఈరోజు విజయవాడలో టిడిపి వర్క్ షాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జనసేన, భారతీయ జనతా పార్టీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భముగా అభ్యర్థులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేలా అభ్యర్థుల ఎంపిక చేపట్టమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నామని, మూడు పార్టీలు వేసే పునాది.. 30 ఏళ్ల భవిష్యత్తుకు నాంది పలకాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో అభ్యర్థులంతా అప్రమత్తంగా ఉండాలని, నిలబెట్టిన అభ్యర్థి గెలవాలనేదే కూటమి లక్ష్యమనీ ఆయన పేర్కొన్నారు.

=====================

ఎన్నికల నేపథ్యంలో విశాఖ నగర పరిధిలోని చినగదిలిలో ఈవీఎం గోదాములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున ఈరోజు తనిఖీ చేశారు. వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాముల లోపల గల వీవీ ప్యాట్లను, ఇతర సామగ్రిని స్వయంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును గమనించిన ఆయన సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాల్లో ఎటువంటి లోపం ఉండరాదని, అందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటన కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, భీమిలి ఆర్.డి.ఓ ఎస్.భాస్కర్ రెడ్డి, రూరల్ మండల తహశీల్దార్ ఎం.శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

=====================

రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా, ఒడిస్సా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఈరోజు కురుపాం మండలం మూలిగూడ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అక్రమ మద్యం, నగదు తరలించకుండా 24 గంటలు నిరంతర పటిష్ట నిఘాను పెట్టాలని అధికారులను సూచించారు. చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా కంట్రోల్ రూమ్ నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.

విరామం

=====================

ప్రతీ ఒక్కరూ ఓటు విలువను తెలుసుకొని, రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును వినియోగించుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు విజయనగరంలో విభిన్న ప్రతిభావంతుల ర్యాలీ ఆమె నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఓటు ప్రాధాన్యతను ప్రతీ ఒక్కరూ గుర్తించాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు తమ ఓటు హక్కును వినియోగించేందుకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. సదరం సర్టిఫికేట్ ప్రకారం 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్నవారు, తాము ఇంటి నుంచే ఓటు వేసుకొనే సదుపాయం ఉందన్నారు. అలాగే అవసరమైన వారికి రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామని, పోలింగ్ కేంద్రాల వద్ద వలంటీర్లను, వీల్ ఛైర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సౌకర్యాలను వినియోగించుకొనేందుకు “సక్షం” యాప్ ద్వారా ముందుగా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

=====================

నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ప్రక్రియల్లో ఎన్నికల సిబ్బంది ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన వంటి అంశాల అవగాహనపై ఈరోజు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంటు, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు దాఖలు, పరిశీలన ప్రక్రియలను నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సిబ్బంది అవగాహన కోసం వర్క్ షాప్ నిర్వహించామని, నామినేషన్ల దాఖలు, పరిశీలన క్రమంలో సిబ్బంది పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించినట్టు తెలిపారు.

=====================

సార్వత్రిక ఎన్నికలు - 2024లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండల పరిధిలో ఎవరైనా జంతువులను వేటాడడానికి ఉపయోగించే నాటుతుపాకులను స్వచ్ఛందంగా అప్పగించాలని సీ.ఐ. ఆర్.భీమరాజు తెలిపారు. పాడేరు ఎస్పీ తుహీన్ సిన్హా ఆదేశాల మేరకు ఈరోజు దొరచింతలపాలెం, నరసాపురం గ్రామంలో 4 సింగిల్ బ్యారల్ తుపాకులను సీ.ఐ నేతృత్వంలో మారేడుమిల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తుపాకులను, ఆయుధాలను పోలీస్ స్టేషన్ లలో అప్పగించాలని లేని పక్షంలో తనిఖీలు నిర్వహించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

=====================

వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించామని, తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టామని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి అవసరాల సన్నద్ధత మొదలైన అంశాలపై.. అన్ని జిల్లాల కలెక్టర్ లతో ఈరోజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనుల లేబర్ కాంపోనెంట్ పెంపుతో పాటు, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారన్నారు.

=====================

పౌర్ణమి సందర్భంగా ఈనెల 25న తిరుమల శ్రీవారి ఆలయంలో గరుడసేవను నిర్వహించనున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన గరుడ సేవలో భాగంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై తిరుమాడ వీధులలో ఊరేగి, భక్తులకు దర్శనమిస్తారని టీటీడీ తెలిపింది.

=====================

ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో కృషి చేసి జిల్లాలో జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు స్థానిక ఎన్జీఓ భవనంలో నిర్వహించిన "రీ ఓరియంటేషన్" శిక్షణా కార్యక్రమంలో ఈరోజు ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో పొందిన పరిజ్ఞానంతో క్షేత్ర స్థాయిలో కార్యాచరణ చేసి, దోమల వ్యాప్తి నియంత్రణకు చర్యలు చేపడుతూ జ్వరాలు ప్రబలకుండా దృష్టి సారించాలన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సర్వేలియన్స్ చేపట్టాలని, మలేరియా, డెంగీ లక్షణాలతో ఉన్న వారిని గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు జరిపాలని అన్నారు. "డ్రై డే" కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు.

=====================

=====================